సాక్షి
ములుగు
మంగళవారం । 20 । జూన్ । 2023



ఐటీఐ.. చదువులో మేటి - 8లో ▸

సాంకేతిక విద్యకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలకు అవకాశాలు ఉండడంతో విద్యార్థులు ఐటీఐలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు.



మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.0^{0} /28.0^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే వేడి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వెంకటాపురం(ఎం): ప్రతీ వ్యక్తి రోజువారి జీవితంలో అరగంట యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని వరంగల్ జిల్లా జడ్జి సత్యేంద్ర తెలిపారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని రామప్ప దేవాలయ ఆవరణలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు యోగా దినోత్సవ వేడుకలను ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ నిర్వహించగా జడ్జి సత్యేంద్ర ఆ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవడం వల్ల సమాజంలో ఉన్నత లక్ష్యం వైపు వెళ్లవచ్చని సూచించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కోర్టు సూపరింటెండెంట్ ఇందిర, యోగా సాధకులు సరస్వతి, జయశ్రీ, చిరంజీవి, గణేష్, రాజేందర్, ఉపేందర్, శ్రీనివాస్‌రావు, లావణ్య, ఉమా, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా



ఏటూరునాగారం: అటవీహక్కుల చట్టాన్ని ఐటీడీఏ, పాలక వర్గం నాయకులు నీరుగారుస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దావూద్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం గిరిజనులతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఓ వసంతరావుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు ఎలాంటి హక్కులు ఆధారాలు లేవనే ఉద్దేశంతో దాడులు చేసి బలవంతంగా లాక్కోవడం సరికాదన్నారు. 2015 డిసెంబర్ 13వ తేదీ వరకు సాగులో ఉన్న గిరిజనులకు 10 ఎకరాల భూమి పట్టా చేసి ఇవ్వాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 2006లో సీపీఎం కేంద్ర కమిటీ కార్యదర్శి బృందకరత్, మాజీ ఎంపీ మీడియం బాబురావుల సమక్షంలో పార్లమెంట్‌లో చట్టం చేయబడిందన్నారు. ఈ చట్టం మేరకు ప్రభుత్వ అధికారులు సమగ్రంగా సర్వే చేయడం లేదని, సర్వే నిర్వహించిన గ్రామాల్లో అర్హులైన గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన పేదలకు ఇంకా హక్కు పత్రాలు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో చిడం లక్ష్మీనారాయణ, పీరీల లక్ష్మి, చరప పద్మ, చిడం నాగరత్నం, సోయం భద్రయ్య, పూనెం చుక్కయ్య, కోసయ్య, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మీ బ్యారేజీని సందర్శించిన నాబార్డు టీం సభ్యులు



కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీబ్యారేజీని సోమవారం నాబార్డు సీజీఎం చింతల సుశీల, సభ్యులు సందర్శించారు. వారికి ఇరిగేషన్ డీఈఈ సురేష్ ప్రాజెక్టు స్వరూపాన్ని వివరించారు.

విరివిగా మొక్కలు నాటాలి



ములుగు: వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. ఈ మేరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని వైకుంఠధామంలో కలెక్టర్ సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం లక్ష్యాన్ని చేరుకునేందుకు అన్ని శాఖలు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి, తహసీల్దార్ మదురకవి సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ ఇక్బాల్, సర్పంచ్ బండారి నిర్మల హరినాథం, ఉప సర్పంచ్ వంగ సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

పలకరించని తొలకరి

10 శాతం మొలకెత్తని పత్తి విత్తనాలు

జిల్లా వ్యాప్తంగా జూన్ ప్రారంభంలో కురిసిన అకాల వర్షానికి, చిరుజల్లులకు రైతులు దుక్కులు సిద్ధం చేసి పత్తి విత్తనాలను నాటారు. ఎకరానికి రూ.8 వేల పెట్టుబడి పెట్టారు. 15 రోజులుగా వర్షాలు కురవకపోవడంతో నాటిన పత్తి విత్తనాలు 10శాతం కూడా మొలకెత్తలేదు. మొలకెత్తిన విత్తనాలు ఎండలకు మాడిపోతుండడంతో ప్రారంభంలోనే నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావుల్లో నీరు ఉన్నప్పటికీ నార్లు పోసేందుకు రైతులు జంకుతున్నారు. వానాకాలం పంటల సాగు ఇప్పటికే 20 రోజులు వెనకబడిపోయిందని, మరింత ఆలస్యమైతే పంటలు పండే అవకాశాలు ఉండవని రైతులు చెబుతున్నారు.



ఎండలకు మాడిపోతున్న మొలకెత్తిన పత్తి మొక్కలు



వెంకటాపురం(ఎం) శివారులో సాగుచేసిన భూమిలో మొలకెత్తని పత్తి విత్తనాలు

జాడలేని నైరుతి రుతుపవనాలు

- వరుణుడి కరుణ కోసం రైతన్నల ఎదురుచూపు
- నార్లు పోసేందుకు వెనకాడుతున్న రైతాంగం
- విత్తనంతోనే మొదలైన పత్తిరైతుల కష్టాలు
- జిల్లాలో ముందుకు సాగని వానాకాలం సాగు

వెంకటాపురం(ఎం): వానాకాలం సీజన్ మొదలైందంటే అన్నదాతల్లో ఆనందం వెల్లువిరిస్తుంది. వర్షాలు ప్రారంభం కాగానే సాగు పనులు ప్రారంభించడం, విత్తనాలు చల్లడం, ఎరువులు తీసుకరావడం లాంటి పనుల్లో అన్నదాతలు బిజీబిజీగా గడుపుతుంటారు. వాతావరణ శాఖ అంచనాలకు దొరకకుండా నైరుతి రుతుపవనాలు దోబుచులాడుతుండడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. వానాకాలం ప్రారంభమై మూడు వారాలు దాటుతున్నా వరుణుడు కరుణించకపోవడంతో రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు. గతేడాది జూన్ ప్రారంభంలోనే వరినార్లు పోసి వ్యవసాయంలో బిజీబిజీగా మారిన రైతులు ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బోరు బావుల దగ్గర సైతం వరినార్లు పోసేందుకు రైతాంగం విముఖత చూపుతోంది.

1,40,116 ఎకరాల్లో పంటల సాగు..

జిల్లాలోని 9 మండలాల పరిధిలో 1,40,116 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. 1,10,069 ఎకరాల్లో వరిపంట, 28,980 ఎకరాల్లో పత్తిపంట, 994 ఎకరాల్లో మొక్కజొన్న, 73 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన విత్తనాలను, ఎరువులను అధికారులు అందుబాటులో ఉంచారు. రైతులు కూడా ముందస్తు సాగుకోసం సిద్ధమయ్యారు. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమవడంతో రైతాంగం వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తుంది.

ఐదెకరాల్లో పత్తి విత్తనాలు నాటిన..



15 రోజుల క్రితం కురిసిన చిరుజల్లులకు ఐదెకరాల్లో పత్తి విత్తనాలు నాటాను. ఎకరానికి రూ.8 వేల చొప్పున 40 వేల పెట్టుబడి అయింది. విత్తనాలు 10 శాతం కూడా మొలకెత్తలేదు. వర్షాలు కురిస్తే పంటను దున్ని మళ్లీ విత్తనాలు నాటాలి. అకాల వర్షంతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇప్పటి వరకు అందలేదు.

- మిల్కూరి ఐలయ్య, రైతు వెంకటాపురం(ఎం)

మృగశిర పోతున్నా వానలు లేవు..



రోహిణి కార్తె పోయి మృగశిర కార్తె వచ్చినా పెద్ద వర్షం ఇప్పటివరకు కురవలేదు. పదేళ్లలో ఇప్పటి వరకు వానాకాలం పంట సాగు చేయకపోవడం ఇదే మొదటిసారి. రుతు పవనాలు మొఖం చాటేయడంతో రైతులందరూ అయోమయంలో పడ్డారు. వానలు కురిస్తేనే నార్లు పోసేది. దుక్కులు మాత్రం దున్ని సిద్ధం చేశాం.

- శెట్టి సంపత్, రైతు వెంకటాపురం(ఎం):

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో వినతులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



ఐటీడీఏలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ

అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్

ములుగు: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వినతులను అదనపు కలెక్టర్ ఆర్డీఓ కూతాటి రమాదేవితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు సంబంధించిన పూర్తి వివరాలు, తగిన కారణాలు తెలపాలని అధికారులకు సూచించారు. గ్రీవెన్స్‌లో 53 దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన 23, రెండు పడక గదుల ఇళ్లు కేటాయించాలని ఆరుగురు, పెన్షన్లు అందించాలని 10 మంది, ఇతర సమస్యలతో మరో 14 మంది వినతులు అందజేశారు. ఆయా శాఖల అధికారులకు దరఖాస్తులను రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో..

ఏటూరునాగారం: ఏజెన్సీలోని గిరిజనులు సమర్పిస్తున్న వినతులపై సెక్టార్ అధికారులు దృష్టి పెట్టాలని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు అన్నారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఏపీఓ వసంతరావుకు 24 మంది వినతులు సమర్పించారు. వాజేడు మండలం గుమ్మడిదొడ్డికి చెందిన సాయి చరణ్ ఇటీవల కారు ఢీకొని మృత్యువాత పడ్డారని, ఆ కుటుంబాన్ని ఐటీడీఏ ఆదుకోవడంతో పాటు అలాగే జెజ్జరి అఖిల్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారని అతని కుటుంబాన్ని సైతం ఆదుకోవాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిసెబాల బాలకృష్ణ కోరారు. మంగపేట మండలం రమణక్కపేటకు చెందిన శ్రీరామ్ లావణ్య ఆర్థిక సాయం చేయాలని వేడుకున్నారు. ఇలా తదితర సమస్యలపై బాధితులు ఏపీఓకు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, పీహెచ్‌ఓ రమణ, భారతి, ఏఓ దామోదరస్వామి, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ గాష్ ఆలం



పరిచయం చేసుకుంటున్న ఏఎస్పీ సంకీర్త్

ములుగు రూరల్: క్రీడలతో మానసికోల్లాసం, శారీరక ధృడత్వం వస్తుందని ఎస్పీ గాష్ ఆలం అన్నారు. ములుగు మండలం జాకారం సమీపంలోని డిస్ట్రిక్ ట్రైనింగ్ సెంటర్(డీటీసీ)లో పోలీస్ అధికారులు, సిబ్బందికి సోమవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌కు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ములుగు, ఏటూరునాగారం సభ డివిజన్ల వారీగా టీంలను ఏర్పాటు చేసి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. మహిళా అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ క్రికెట్ పోటీల్లో పాల్గొని పోలీస్ అధికారులను ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, సీఐ మేకల రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభతో ముగిసిన స్థాయీ సంఘం సమావేశం



మాట్లాడుతున్న నాగజ్యోతి

ములుగు: జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్థాయీ సంఘం సమావేశం ఇటీవల మృతి చెందిన జెడ్పీ చైర్మన్ జగదీశ్ సంతాప సభతో ముగించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు జగదీశ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సంతాప సంస్మరణ తీర్మాణాన్ని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ జిల్లా ప్రజలు మంచి నాయకున్ని కోల్పోయారని తెలిపారు. జెడ్పీ సభ్యులతో గౌరవంగా మెదిలేవారని తెలిపారు. ప్రతీ విషయంలో తనను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ తోబుట్టువుల చూసుకున్నారని కన్నీటి పర్యంతం అయ్యారు. అనంతరం జెడ్పీ సీఈఓ ప్రసూన రాణి మాట్లాడుతూ జిల్లా ప్రగతికి బాటలు వేసేందుకు ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ములుగు జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు సకినాల భవాని, రుద్రమదేవి, హరిబాబు, రమణ, గాంధీ, పుష్పలత, డీఆర్‌డీఓ నాగపద్మజ, సంక్షేమ అధికారి ప్రేమలత, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రియాజ్‌మిర్జా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనంతో ఉత్సవాలు చేయడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

వెంకటాపురం(ఎం): ప్రజాధనంతో దశాబ్ది ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని పాలంపేటలో బీజేపీ మండలాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమిలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం పేరు మీద సీఎం కేసీఆర్ కుటుంబానికే లబ్ధి చేకూరిందని తెలిపారు. మిగులు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, జిల్లా నాయకులు శీలమంతుల రవీంద్రాచారి, చల్లూరి మహేందర్, బాణాల రాజ్‌కుమార్, ఉత్తమ్‌కుమార్, గాదం కుమార్, ఇమ్మడి రాకేష్, జినుకల కృష్ణాకర్‌రావు, కొత్త సురేందర్ పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు, బకాయి బిల్లులు చెల్లించాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్
- యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్, డీఈఓ కార్యాలయాల ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ములుగు రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను, బకాయి బిల్లులను చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, డీఈఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులను విస్మరించడం సరికాదన్నారు. తొమ్మిది నెలలుగా కార్మికులకు వంట, కోడిగుడ్ల బిల్లులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను అడిగితే ఎస్టీఓలో ఉన్నాయని చెబుతున్నారనే తప్పా ఖాతాల్లో జమకావడం లేదని వాపోయారు. వేతనాలు పెంచినట్లు జీఓ జారీ అయినప్పటి నుంచి రాజకీయాల పేరుతో కొంత మంది అధికారులు కార్మికులను తొలగిస్తామని బెదింపులకు పాల్పడుతున్నారని అన్నారు. డిమాండ్‌లు పరిష్కారించని పక్షంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గున్నాల రాజకుమారి, జనగాం శోభ, ప్రమీల, సమ్మక్క, కురుసం సమ్మక్క, పర్వీన్, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పచ్చదనంతో కళకళలాడాలి

- కలెక్టర్ కృష్ణ ఆదిత్య
- జాకారం అటవీ బ్లాక్‌లో ఘనంగా హరితోత్సవం



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్



అదనపు కలెక్టర్‌కు తమ సమస్యలను వివరిస్తున్న మహిళలు

ములుగు: జిల్లాలోని పరిసరాలు పచ్చదనంతో కళకళలాడాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. మండల పరిధిలోని జాకారం బ్లాక్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన హరితోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 103.43 లక్షల మొక్కలను నాటారని అధికారులను అభినందించారు. 9వ విడత హరితహారం కార్యక్రమంలో అన్ని శాఖలు కలిపి 14.50 లక్షల మొక్కలను నాటాల్సి ఉంటుందని అందులో 50 శాతం బాధ్యత అటవీ అధికారులదేనని తెలిపారు. కలెక్టర్ల రివ్యూ మీటింగ్‌లో సీఎం కేసీఆర్ మొదట ప్రస్తావించేది ములుగు గురించేనని వివరించారు. 9 సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలియజేసేలా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎస్పీ గాష్ ఆలం, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, ఓఎస్డీ అశోక్ కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, డీఎఫ్ఓ జోగేందర్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ తీసుకోవాలి

ఎస్ఎస్ తాడ్వాయి: నర్సరీల్లో మొక్కల పెంపకం, పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ అధ్వర్యంలో హరితోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇలా త్రిపాఠి హాజరై మొక్కలు నాటారు. పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు.

తునికాకు సేకరణ డబ్బులపై కూలీల విన్నపం

తునికాకు సేకరించిన కూలీలకు ఆకు సేకరణ పూర్తయి నెలరోజులు గడుస్తున్నా డబ్బులు జమ కాలేదని సంబంధిత కూలీలు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. తునికాకు బస్తాలు కూడా కల్లాలోంచి తీసుకెళ్లారని, డబ్బులు మాత్రం ఇప్పటి వరకు అకౌంట్‌లో జమకాలేదని తెలిపారు. దీని పై స్పందిస్తూ అక్కడే ఉన్న ఫారెస్టలతో డబ్బుల విషయం పై ఆరా తీశారు. గ్రామంలో కోతులు బెడదపై నర్సింగాపురం మహిళ అదనపు కలెక్టర్ వివరించారు. ఈ విషయం పై ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఉపాధి కూలీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు



కూలీలతో మాట్లాడుతున్న బీరెడ్డి సాంబశివ

వాజేడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. మండల పరిధిలోని టేకులగూడెంలో సోమవారం ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం గత బడ్జెట్‌లో రూ.90వేల కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లను మాత్రమే కేటాయించిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలను పెంచే ప్రభుత్వాలు బడ్జెట్‌లో కోత విధించి కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు ఇంటి స్థలాలను ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు, యాలం రాంబాబు ఉన్నారు.

ఐటీఐ..చదువులో మేటి!



ప్రభుత్వ ఐటీఐ కాజీపేట

సాంకేతిక విద్యకు రోజురోజూకూ ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వివిధ ఉద్యోగాలకు విస్తృత అవకాశాలు ఉండడంతో విద్యార్థులు ఐటీఐలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. కోర్సు కాల వ్యవధి తక్కువగా ఉండదం..పైగా కళాశాల్లోనే ఏర్పాటు చేసే ప్రాంగణ నియామకాల ద్వారా ఎంపికై జీవితంలో స్థిరపడే అవకాశం ఉండడంతో విద్యార్థులు ఈ విద్యను అభ్యసించదానికి ఇష్టపడుతున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో(ఐటీఐలు) 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. ఉన్నత విద్య అవకాశాలు, అప్రెంటీస్ ఎంపికల్లో పారదర్శకత వంటి చర్యలు ఐటీఐ విద్య బలోపేతానికి దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీఐ విద్యపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆయా ఐటీఐల్లో సీట్ల వివరాలు..

జయశంకర్ భూపాలపల్లి	84
ఏటూర్‌నాగారం (ఆదివాసీ పిల్లలకు)	63
మహబూబాబాద్	188
ములుగు రోడ్	678
హన్మకొండ	287
కాజీపేట	68

అర్హతలు..

- కోర్సుల్లో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదో తరగతి తప్పిన విద్యార్థులకు ఏడో తరగతి మార్కులు, ఎనిమిదో తరగతి టీసీ ఆధారంగా వెల్డర్ ట్రేడ్‌ల్లో ప్రవేశాలు కల్పిస్తారు.
- 14 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వారు ప్రవేశాలకు అర్హులు.
- అధిక ఉత్తీర్ణతలున్న వారూ అర్హులే.

ఫీజు వివరాలు..

- ప్రభుత్వ ఐటీఐల్లో రూ. 60 కాషన్ డిపాజిట్ కింద చెల్లించాలి.
- ప్రైవేట్‌లో రూ. 7,200 ఫీజు అమల్లో ఉండగా గతేడాది రూ. 15,500 పెంచారు.

సాంకేతిక విద్యకు పెరుగుతున్న ఆదరణ

- పదో తరగతి అర్హతతో ప్రవేశాలు
- అప్రెంటీస్ నియామకాలు మెరుగు
- ఐటీఐ విద్యలో నాణ్యత, నైపుణ్యతకు పెద్దపీట

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. హన్మకొండ, కాజీపేట, ములుగు రోడ్, జయశంకర్ భూపాలపల్లి, ఏటూర్ నాగారం, మహబూబాబాద్‌లో ఉన్నాయి. వీటిలో 1368 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది కొత్త కోర్సులకు అవకాశం కల్పిస్తే కాజీపేట ఐటీఐ శాఖలో మరో 148 సీట్లు పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఉన్న 34 ప్రైవేట్ ఐటీఐల్లో దాదాపు 5 వేల సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లోని సీట్లకు ప్రవేశాలు నిర్వహిస్తారు.

అందుబాటులో ఉన్న కోర్సులు ..

పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ప్రస్తుతం 15 రకాల కోర్సులున్నాయి. ప్రభుత్వ విద్యలో రెండు సంవత్సరాల కోర్సుల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఇంజనీరింగ్ మెకానిక్, ఏవో కెమికల్, ఆర్‌అండ్‌ఏసీ, మోటార్ మెకానిక్, డ్రాఫ్టమన్ మెకానిక్, డ్రాఫ్టమెన్ సివిల్ ప్రధానమైనవి. ఏడాది కోర్సుల్లో డీజిల్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్, డ్రెస్‌మెకింగ్, కెమికల్ వంటి కోర్సులున్నాయి. ప్రైవేట్ కళాశాలలు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, కెమికల్, సివిల్ వంటి డిమాండ్ ఉన్న కోర్సులకే ప్రవేశాలు నిర్వహిస్తున్నాయి.

నైపుణ్యాలు.. అవకాశాలు..

ఆయా కళాశాలల్లో వృత్తి నైపుణ్యాలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ చేపడుతున్నారు. ఫలితంగా ప్రస్తుతం ప్రాంగణ నియామకాలు అధికంగా జరుగుతున్నాయి. గతేడాదిలో జాబ్‌మేళాల ద్వారా 500 మందికి ఉద్యోగాలు లభించాయి. క్యాడ్‌బరి, అపోలో టైర్స్, ఎల్‌అండ్‌టీ, ఓలమ్, ఆర్‌టెల్ కమ్యూనికేషన్, విశాఖ ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌కు చెందిన కంపెనీలు ఉద్యోగాలు కల్పించాయి.

ప్రభుత్వ ఐటీఐల్లో దరఖాస్తుల పరిశీలన..



ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ఆరంభమైంది. మరోపక్క దరఖాస్తుల పరిశీలన కూడా చురుగ్గా సాగుతోంది. ప్రభుత్వం సంస్కరణల ద్వారా విద్యలో నాణ్యత పెంచే చర్యలుపై దృష్టిసారించింది. భవిష్యత్తులో అభ్యర్థులకు అవకాశాలు పెరగనున్నాయి. జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలి.

– అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ కాజీపేట, ఐటీఐ

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



వరంగల్: వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజులు (21, 22 తేదీలు) రాష్ట్ర స్థాయి జూడో పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాష్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పోటీలు జరుగనున్న దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పోటీలను జూడో అసోసియేషన్ అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ప్రారంభిస్తారన్నారు. తూర్పు ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారు కర్ణాటకలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఒయాసిస్ విద్యా సంస్థల చైర్మన్ పరంజ్యోతి ప్రారంభించారు.

మహిళలు, వృద్ధుల కోసం ట్రావెల్–9 టికెట్



ప్రయాణికురాలికి టీ–9 టికెట్ ఇస్తున్న కండక్టర్

హన్మకొండ : మహిళలు, వృద్ధుల కోసం టీఎస్ ఆర్టీసీ ట్రావెల్–9 టికెట్ ప్రవేశపెట్టిందని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు, హనుమకొండ డిపో మేనేజర్ బాబు నాయక్ తెలిపారు. ఆదివారం నుంచి ఈ టికెట్ అమల్లోకి వచ్చిందని వారు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వినియోగించుకోవచ్చన్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ఈ టికెట్ చెల్లుబాటు అవుతుందని తెలిపారు. రూ.100 చెల్లించి టికెట్ తీసుకుని ఒక రోజులో 60 కిలో మీటర్లు ప్రయాణించొచ్చన్నారు. ప్రతి సర్వీస్‌లో కండక్టర్ వద్ద ఈ టికెట్ అందుబాటులో ఉంటుందన్నారు. దీని ద్వారా ప్రయాణికుడికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుందన్నారు. 60 ఏళ్లపై బడిన వృద్ధులు, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మూల మర్రితండా జీపీకి తాళం

- సర్పంచ్ కుమారుడి ఆగడాలపై ప్రజల ఆగ్రహం
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపాటు



గ్రామ పంచాయతీకి తాళం వేస్తున్న తండా వాసులు

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం మూలమర్రితండా గ్రామ పంచాయతీ కార్యాలయానికి తండా వాసులు సోమవారం తాళం వేశారు. అనంతరం సర్పంచ్ కుమారుడి ఆగడాలను నిరసిస్తూ తండాలోని ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ తేజావత్ జగినిలాల్ కుమారుడు భరత్‌కుమార్ ఆగడాలు రోజు రోజుకూ అంతులేకుండా పోతున్నాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి వీడీసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా చేస్తే తమ తండాలో మాత్రం సర్పంచ్ తనయుడు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి భరత్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు డీఈఈసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఈఈసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రవేశాలకు (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దు మీడియం) ఈనెల 21న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 4 నుంచి 10వ తరగతి వరకు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, టీసీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ పీహెచ్‌సీ ధ్రువపత్రాలతో హాజరై పరిశీలన చేయించుకోవాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



మొక్క నాటి నీరు పోస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో హరితోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లతో కలిసి సీఎండీ గోపాల్ రావు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారంతో తెలంగాణ వృక్షాలు, వనాలతో పచ్చదనంగా మారిందన్నారు. 9వ విడత హరిత హారంలో ప్రతీ ఉద్యోగి భాగస్వాములవ్వాలన్నారు. రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో నియంత్రించడానికి హరిత వనాలు అభివృద్ధి చేయడం ఎంతో అవసరమన్నారు. ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రంగా నిర్మించడమే మన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్ లాల్, మోహన్ రావు, కిషన్, ప్రభాకర్, రాజుచౌహాన్, కె.ఎన్.గుట్ట, రవీంద్రనాథ్, బీకంసింగ్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్‌తో సత్వర సేవలు

- కరీంనగర్ జోన్ ఇన్‌చార్జ్ కేశరాజు భానుకిరణ్



సంబురాల్లో భానుకిరణ్, అధికారులు, సిబ్బంది

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్, పార్సిల్, కొరియర్ సర్వీస్‌తో సత్వర సేవలు అందుతున్నాయని ఆర్టీసీ కరీంనగర్ జోన్ లాజిస్టిక్ ఇన్‌చార్జ్ కేశరాజు భానుకిరణ్ అన్నారు. లాజిస్టిక్ సేవలు ప్రారంభించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లోని లాజిస్టిక్, పార్సిల్ కౌంటర్‌లో ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటకలోని పలు ప్రాంతాలకు 440 కౌంటర్ల ద్వారా అతి తక్కువ ధరకు అతి వేగంగా పార్సిళ్లను చేరవేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా క్విక్ డెలివరీ పథకం ద్వారా కేవలం రూ.99కే మధ్యాహ్నం 12.00 గంటలలోపు బుక్ చేసిన పార్సిళ్లు రాత్రి 9.00 గంటల లోపు చేరేలా, రాత్రి 9.00 గంటలలోపు బుక్ చేసిన పార్సిళ్లను మరునాడు మధ్యాహ్నం 12.00 గంటలలోపు చేరవేస్తున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 53 కౌంటర్ల ద్వారా తమ సేవలు అందిస్తున్నామని, త్వరలో వరంగల్‌లో డోర్ డెలివరీ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. డోర్ డెలివరీకి ఆసక్తి ఉన్న ఏజెంట్లు సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా లాజిస్టిక్స్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది, హమాలీలను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.వేణుగోపాల్, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డి.శ్రవణ్ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, బి.సతీశ్ కుమార్. కౌంటర్ ఇన్‌చార్జి జి.రవి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- వర్ధన్నపేట మండల కోఆప్షన్ సభ్యుడి దుర్మరణం



పాషా (ఫైల్)

మామునూరు/వర్ధన్నపేట : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై లారీ.. బైక్‌ను ఢీకొనడంతో మండల కోఆప్షన్ సభ్యుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మామునూరు శివారు టీఎస్ఎస్పీ బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన ఎండీ.పాషా(72) మండల కోఆప్షన్ మెంబర్‌గా కొనసాగుతున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నూర్జాహబేగం ఐదేళ్ల క్రితం, పెద్ద కుమారుడు బాషమియా గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తుతం చిన్నకుమారుడు సలీంపాషా వరంగల్‌లో టైలర్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో పాషా ఆదివారం బైక్‌పై ఇల్లంద నుంచి వరంగల్‌లోని చిన్న కుమారుడు వద్దకు వచ్చాడు. సోమవారం ఉదయం ఇల్లందకు బయల్దేరాడు. మామునూరు టీఎస్ఎస్పీ బెటాలియన్ బంక్‌లో పెట్రోల్ పోసుకుని వెళ్తూ రహదారి క్రాస్‌చేస్తుండగా వరంగల్ నుంచి ఇల్లంద వైపునకు వెళ్తున్న లారీ.. బైక్‌ను ఢీకొంది. దీంతో పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్సైలు రాజేష్‌రెడ్డి, కృష్ణవేణి ఘటనా స్థలికి చేరుకుని లారీని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అరూరి రమేష్ ఎంజీఎం మార్చురీకి వద్దకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో యువకుడి మృతి



కిరణ్ (ఫైల్)

వర్ధన్నపేట: ఓ యువకుడు చిన్న వయస్సులోనే గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఘటన వర్ధన్నపేటలో చోటుచేసుకుంది. వర్ధన్నపేటకు చెందిన మేడ కిరణ్(30) బీటెక్ పూర్తి చేసి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కిరణ్‌ను వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 20న నిర్వహించే అన్ని పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ సోమవారం రాత్రి తెలిపారు. దూరవిద్య ఎమ్మెస్సీ మ్యాథ్స్ ఫైనల్ ఇయర్ పేపర్ కూడా వాయిదా వేశామని, ఆ పేపర్ పరీక్షను జూలై 3వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు.

శోభాయమానం.. సహస్ర కలశాభిషేకం

- సోమవారం ఉదయం నుంచి కార్యక్రమాలు ప్రారంభం
- శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దాస్యం



అమ్మవారికి కలశాభిషేకం చేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్ : చారిత్రక భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారికి సహస్రకలశాభిషేకం శోభాయమానంగా జరిగింది. ఉత్సవ కార్యక్రమాలు సోమవారం ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిర్మాల్యసేవలు, అమ్మవారికి నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, ఉత్సవానుజ్ఞప్రార్థన, గౌరి గణపతిపూజ, తదితర పూజలు నిర్వహించి కలశ స్థాపన చేశారు.

ఉత్సవాలను ప్రారంభించిన చీఫ్ విప్ వినయ్‌భాస్కర్..

ప్రభుత్వ చీఫ్‌విప్, హన్మకొండ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శాకాంబరీ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్, సారయ్యకు ఈఓ శేషు భారతి, భద్రకాళి శేషు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

శోభాయమానంగా సహస్రకలశాభిషేకం..

సహస్రకలశాభిషేకం మధ్యాహ్నం ప్రారంభమైంది. అగ్నిపురాణంలో చెప్పిన విధంగా వేదపండితులు నాలుగు వేదాల మూలమంత్రాలు పఠిస్తుండగా భక్తులు భద్రకాళి శరణం మమ అంటూ పలికారు. అనంతరం అమ్మవారికి అభిషేకం శోభాయమానంగా జరిగింది. కొమురవెల్లి దేవాలయం వేద పండితుడు వేలేటి సిద్ధరామశర్మ ద్వివేది, భద్రకాళి దేవాలయ ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, పార్నంది నర్సింహామూర్తి, సామవేద పండితుడు ప్రదీప్‌శర్మ, అర్చకులు, భద్రకాళి సాంగ ఆగమ వేద పాఠశాల విద్యార్థులు అభిషేకకార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, వరంగల్‌కు చెందిన బాసాని విశ్వప్రకాశ్, శోభ దంపతులు సహస్రకళశాభిషేకం దాతలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని కాళీక్రమంలో అలంకరించారు. రాత్రి కామేశ్వరీనిత్యాక్రమంలో అవరణార్చనలు, సాయంతనపూజ, నీరాజనమంత్రపుష్పం,తీర్థప్రసాదవితరణ జరిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.5 లక్షల విలువైన నగలు, రూ.75వేల నగదు అపహరణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ, క్లూస్‌టీమ్



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సీఐ

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో దుండగులు చొరబడి రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరుగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు పొన్నం లింగం, శ్రీలత దంపతుల కథనం ప్రకారం.. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహం జరిగింది. ఆరు నెలల నుంచి కుమారుడు, కోడలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. లింగం, శ్రీలత స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉంటున్నారు. అయితే శ్రీలత అమ్మగారి ఊరు ఐనవోలు మండలం సింగారం గ్రామానికి దంపతులిద్దరూ శనివారం వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఆదివారం రాత్రి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.75వేల నగదును అపహరించారు. సోమవారం ఉదయం దంపతులు ఇంటికి వచ్చేసరికి గేటుపక్కన ఉన్న ఇనుపరాడ్ వంగి ఉండడం, పూలకుండి కింద పడి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూసేసరికి ఇంటి వెనుక తలుపు తెరిచి ఉంది. బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న 8 బంగారు ఉంగరాలు, ఒక బంగారు గొలుసు, కమ్మలు, పుస్తె మొత్తం 8 తులాల బంగారు నగలు, వెండి పట్టగొలుసులు, మట్టెలు, బ్రాస్‌లెట్ మొత్తం 20 తులాల వెండి ఆభరణాలు, రూ.75వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ ఎ.రాఘవేందర్, ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్ అక్కడకు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఘటనా స్థలిని పరిశీలించిన ఏసీపీ

విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ ఘటనా స్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీమ్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు. బాధితుడు లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే..

స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, ఏసీపీ కార్యాలయానికి సమీప కాలనీలోని ఇంటిలో చోరీ జరగడంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగలు హల్‌చల్ చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు రాత్రివేళల్లో గస్తీని, పెట్రోలింగ్‌ను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.